# పాతికేళ్ల కథ

ఉదయపు నీరెండలో ఇంటిముందు లాన్‌లో కుర్చీలో కూర్చున్న శంకర్ చేతిలో నవల. పేజీ తరువాత పేజీ తిరుగుతోంది. సూర్యకిరణాల కాంతిలో కళ్ళ జోడు ఫ్రేమ్ జిగేల్ మంటున్నది. పదిహేనవ పేజి రెండవ పేరాలో మొదటిలైను చదువుతూ టప్పున పుస్తకం మూసేశాడు.

సుముహూర్తమని దైవజ్ఞులు శుభలేఖల్లో అచ్చువేశారు గాని అది దుర్ముహూర్తంగా అతడి జీవితంలో ఒక దారుణసంఘటనగా నిలిచిపోయింది. పెళ్ళి అయింది. ధనికుడైన మామగారు, హనీమూన్ ట్రిప్పుకు చెక్కు రాసి యిస్తూ "మీకిష్టము వచ్చినన్ని రోజులు మీ కిష్టంవచ్చిన ప్రదేశాలు తిరిగిరండి" అని చేతికిచ్చారు.

"నాకు ఢిల్లీలో ఎల్లుండి మధ్యాహ్నం ఇంటర్వ్యూఉంది. నేను తిరిగివచ్చిన తరువాత ఇద్దరం వెళ్తాము. ఈలోపల నీరజ నడిగి టికెట్లు తెప్పించండి. నేను ఇంటర్వ్యూకాగానే బయలుదేరివస్తాను" అన్నాడు కొత్తఅల్లుడు.

కారులో ఆ సాయంత్రం తండ్రీ కూతుళ్ళు కూడా స్టేషన్‌కి వచ్చారు. సీట్ చూసుకుని సూట్‌కేసు పెట్టి, రైలుదిగి వాళ్ళతో మాట్లాడుతూ నిలబడ్డాడు పెళ్ళి కొడుకు. ఇంటర్వ్యూని గురించి మాట్లాడుకున్నారు. ఆ కొత్త పెళ్ళికొడుక్కు నూతన వధువు చెవిలో ఏదో చెప్పాలన్న ఉత్కంఠ కళ్ళల్లో కనబడుతోంది.

అతడి సంగతి అమ్మాయి కనిపెట్టి "నాన్నా, ఒక వీక్లీ కొనుక్కొస్తావా? రైలు కదిలేవేళయింది. తొందరగా రావాలి" అంది.

"చెప్పవేమిటమ్మా అప్పటినుంచీ?" పరుగులాంటి నడకతో కదిలాడు మామగారు.

రైలు కూతవేసింది. "నేను తొందరగా వచ్చేస్తాను. నీవీలోపల ప్లాన్ చెయ్యి"అంటూ ఆమె చేతిని తనచేతిలోకి తీసుకుని పెదవుల కానించుకుని ఊపాడు పెళ్ళికొడుకు.

అంతలో మరోసారి రైలు కూతవేసింది. పచ్చజండాతో గార్డు కనబడ్డాడు. మామగారు ఉరుకు పరుగులమీద వచ్చాడు.

రైలు కదిలింది.

"ఎక్కు బాబూ !" తొందర పెట్టాడాయన పీక్లి చేతిలో పెట్టి.

"రన్నింగ్ ట్రైన్‌లో ఎక్కడం నాకలవాటు" యువకుడు ఒక కాలు మెట్టు మీద పెట్టి రెండోకాలు పెట్టబోయే అంతలో రైలు వేగాన్ని పుంజుకుంది.

యువకుడు రైలుకూ ప్లాట్‌ఫారమ్‌కూ మధ్య సందులో పడిపోయాడు.

వధువు గావుకేక పెట్టింది.

వెనక్కు తిరిగిన గార్డు జనంతోపాటు గబగబా వచ్చాడు. రైలు నిలిచి పోయింది

ఆ సందులో నుంచి యువకుడిని బైటికి తీయటం చాలా కష్టమైంది. అతడు స్పృహలో లేడు. మోకాళ్ళ కిందివరకూ రక్తంతో బట్టలు తడిసిపోయాయి. వెంటనే రైల్వేహాస్పిటల్లో చేర్చటానికి ఏర్పాట్లు జరిగాయి.

నీరజ కళ్ళు గట్టిగా మూసుకుని తండ్రి చెయ్యిపట్టుకుని హాస్పిటల్ కి వెళ్ళింది. యువకుడిని థియేటర్‌లోకి వెంటనే తీసుకువెళ్ళారు

థియేటర్ దగ్గరగా బెంచీమీద కూర్చున్న నీరజకు చెమటలు పోస్తున్నాయి. గుండె పరుగెత్తే పందెపుగుఱ్ఱంలా కొట్టుకుంటోంది.

"నాన్నా ఎప్పుడు బయటికి తీసుకువస్తారు ?"

"అమ్మా, ఆపరేషన్ చెయ్యాల్సి ఉంటుంది. గంటకుపైగా పట్టవచ్చు."

"అంటే ఏంచేస్తారు నాన్నా ?"

"ఆ పరిస్థితిని బట్టి ఏంచేస్తారో మరి ?"

నీరజ ఒణికిపోయింది. ఏడుపు మొదలు పెట్టింది.

"నేను ఇంటికి వెళ్ళి అబ్బాయి తండ్రినీ తల్లినీ తీసుకువస్తాను నీవిక్కడ ఉండగలవా? ఎందుకులే, నాతోరా. మళ్ళ రావచ్చు" ఇద్దరూ కారులో బయలు దేరి ఇంటికి వెళ్లగానే 'అబ్బాయి ఊరికి వెళ్ళాడని అమ్మాయి ఏడుస్తోందను'

కుంటూ అత్తగారూ మామగారు ఎదురుగా వచ్చారు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిలి పోయిన కూతుర్ని తల్లికి ఒప్పగించి, యువకుడి తల్లిదండ్రులతో హాస్పిటల్ కి చేరుకున్నాడు అమ్మాయి తండ్రి. అప్పటికి ఆపరేషను అయి కట్లు కడుతున్నారని లోపలినుంచి కబురు వచ్చింది.

"ఎలా ఉన్నాడు అబ్బాయి ?" తండ్రి బొంగురు గొంతు.

"మానాయన కళ్ళు తెరిచేఉన్నాడా ?" తల్లి ఏడుపు స్వరం.

థియేటరులో నుంచి బైటికి వచ్చిన నర్సును దూరంగా తీసుకువెళ్ళి అడిగాడు నీరజ తండ్రి.

"కాళ్లు రెండూ నలిగి నజ్జు నజ్జు అయ్యాయి. తియ్యక తప్పలేదు. ఇంకా మైకంలో ఉన్నాడు."

ఆ విషయం యువకుడి తల్లిదండ్రులకు తెలిసింది. తల్లి దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది. తండ్రి కండువాతో కళ్ళు ఒత్తుకుంటున్నాడు.

"ఈ పెళ్ళి మూలంగా వాడికి ప్రాణమ్మీదికి వచ్చింది. ఏంముహూర్తమో? రత్నం లాంటి నా కొడుకు......."

''వద్దంటే విన్నావా? ఇప్పుడేం తొందరొచ్చింది వాడి ఉద్యోగం సంగతి తెలియనీ అంటే విన్నావా ? వాళ్లమాటలకు పొంగిపోయి తొందర పెట్టావు. ఆ ముహూర్తమే ఇంతపని చేసింది."

"ముహూర్తమేం చేసింది ? ఆ పిల్ల జాతకం......."

రెండు చెవులూ మూసుకున్నాడు అమ్మాయి తండ్రి.

"అబ్బాయికి నిద్రపట్టటానికి ఇంజక్షను ఇచ్చారట ఇప్పుడే మెలకువ రాదట. మేము ఇంటికి రాలేము. మీరు కావాలంటే భోజనం చేసిరండి" అన్నారిద్దరూ ఏడుస్తూ.

అమ్మాయి తండ్రి నిర్ఘాంతపోయాడు.

ఈ సమయంలో తను ఇంటికి వెళ్లగలడా ? కాళ్లు కదలలేదు.

ఇంట్లో అమ్మాయి ఎట్లా ఉన్నదో? కడుపులో పేగు కదిలినట్లయింది.

తలవంచుకుని కొంతసేపాలోచించి విధిలేక బయలుదేరినట్టుగా కదిలాడు అమ్మాయితండ్రి.

ఆ మరునాడంతా అమ్మాయికి జ్వరం, కలవరింతలు. తల్లిదండ్రీ భయపడి పోయారు. హాస్పిటల్‌కి టెలిఫోను చేసి కనుక్కుంటే నొప్పి తగ్గేటందుకు మాత్రలు ఇస్తున్నారని తెలిసింది. మూడోరోజు ఆయన వెళ్లేవరకూ వాళ్ళక్కడ లేరు. డాక్టరు తనకూ తెలియదని అన్నాడు.

"చచ్చిపోయి ఉంటాడు. తల్లిదండ్రులు అటునుంచి అటే వాళ్ళఊరు వెళ్ళి ఉంటారు" తండ్రి ఊహించి మెల్లగా బయటపెట్టాడు.

"ఆఁ హా ? తను చచ్చిపోయి ఉంటాడనుకున్నారు కాబోలు !" నవల కిందపడిపోయింది.

"అంతే ఆ అధ్యాయం అంతటితో ముగింపచేశారు."

సరిగ్గా ఇరవైనాలుగు సంవత్సరాల క్రిందట జరిగిన ఉదంతమిది. హాస్పిటల్లో అతడిని చేర్చటం, ఆపరేషను జరగటం, తల్లిదండ్రులు రావటం, తిండీ తీర్థం లేకుండా వాళ్ళు తనదగ్గర ఉండటం వరకూ నిజం. ఉన్నది ఉన్నట్టుగా నవల రాశారెవరో. కాని ఆ తరువాత ఏంజరిగినదీ రాయలేదు. చచ్చిపోయినట్టుగా సూచించి ముగించాడు రచయిత, ఆ అధ్యాయాన్ని.

శంకర్ విషాదంగా నవ్వుకున్నాడు.

అవును, ఆమెకు తను లేనట్లే. తనకామె లేనట్లే.

చచ్చిపోవటమంటే అంతేగా ?

కాని, తను తలిదండ్రులతో ఇంటికి వచ్చి మంచి వైద్యం చేయించుకున్నాడు. తనే డాక్టరు కనుక కృత్రిమావయవాల సెంటర్లలో అత్యంతాధునికమైన దానితో సంప్రతించాడు. పుండు మానిపోయిన కొన్ని నెలల తరువాత సెంటర్ నుంచి ఒక డాక్టరు ఒక టెక్నీషియన్ వచ్చారు.

పుండు మానిన తరువాత కొన్ని నెలలు ఆగాలని వివరంగా చెప్పి కొలతలు తీసుకునివెళ్ళారు. ఒకనెలలోపల తయారుచేసి కాళ్ళకు అమర్చివెళ్ళారు.

శంకరిప్పుడు చంకక్రింద పెట్టుకునే కర్రల సహాయంతో నడక నేర్చుకున్నాడు ఆరు నెలలపాటు. అవి లేకపోయినా అయిదారు మీటర్లదూరం నడవటం అలవాటు చేసుకుంటున్నాడు. మెల్లగా సంవత్సరం గడిచింది. ఆ తరువాత ఆధునికంగా కనిపెట్టబడిన వాకర్ కొన్నాడు.

ఈ ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో ఎన్నో మార్పులు జరిగాయి. తండ్రి చనిపోయాడు. తల్లి తమ ఊరిలో ఉన్నపొలాలూ ఇల్లు అమ్మింది. విశాఖపట్నంలో సముద్రానికి దగ్గరగా శంకర్ మెచ్చేటట్టుగా ఇల్లు కట్టింది. డబ్బు బ్యాంకిలో కొడుకు పేర పెట్టింది. నెమ్మదిగా శంకర్‌చేత ప్రయివేట్ ప్రాక్టీసు మొదలు పెట్టించింది. నిజానికికతడు సర్జన్. కాని నేత్రవైద్య శాస్త్రంలో డిప్లొమా కూడా ఉంది.

అతడినిప్పుడు ఎంతో గమనించి తదేక దృష్టితో చూస్తేనేగాని కృత్రిమ పాదాలని ఎవరికీ తెలియదు. అంతగా ప్రాక్టీసుచేశాడు. అతడిప్పుడొక పెద్దకళ్ళ డాక్టరు. ప్రాక్టీసు పుంజుకుంటున్నది. తరువాత సర్జన్‌గా డిగ్రీ తెచ్చుకున్నాడు.

కాని అతని తల్లి పెద్దదయింది. నౌకర్లు ఇంటిపనులు చూసుకుంటారు. ఆమె అతడికి దగ్గర ఉండి అన్ని సౌకర్యాలూ చూస్తుంది డిస్పెన్సరీ ఇంట్లోనే ఉన్నప్పటికీ తల్లితోచెప్పి వేళకువెళ్తాడు. అతడనుకుంటాడు 'తల్లి అన్నీ మర్చిపోయి సుఖంగా ఉందని' కాని ఆమె మనసులోని గాయం మానలేదు. తిరిగి వివాహం చేసుకోమని కొడుకును వేడుకుంటుంది. కన్నీరు కారుస్తుంది.

మనసు పట్టలేని సమయాలలో ఆమె 'నాయనా. నేనెంతకాలం ఉండి చూస్తానునిన్ను ? పెళ్ళిచేసుకో నాయనా !" అంటుంది

"నాకేం పెళ్ళమ్మా ఇప్పుడు ?'' అంటూ నవ్వేస్తాడు.

కాని-కథ మాదిరిగా అతడి జీవితమంతటితో ఆగిపోలేదు

అతడు సర్జనుగా ప్రాక్టీసు మొదలుపెట్టిన ఐదు సంవత్సరాలకు ఒక కాలేజి లెక్చెరరు చెట్లకింద నడుస్తుండగా కంట్లో ఒక సన్నటి పుల్లలాంటిది గుచ్చుకుంది. ఆ ఊరిలో సుప్రసిద్ధ నేత్రవైద్యుడనిపించుకున్న శంకర్ దగ్గరికి ఆమెను మరొక లెక్చెరర్ తీసుకువచ్చింది.

అతి నైపుణ్యంతో డాక్టరు ఒక పనిముట్టుతో పుల్లనుతీసి మందువేసి కట్టు కట్టాడు.

''ఐదు నిమిషాలయిన తరువాత తీసుకువెళ్ళండి. మళ్ళీ రేపు తీసుకురండి. ఇది పుల్లకనుక పనిముట్టుతో తీయగలిగాను. కొన్ని చెట్లకు వచ్చిన గొంగళి పురుగులు వేళ్ళాడుతూ ఉంటాయి. వాటి వెంట్రుకలు కనుక కంట్లో దిగబడితే చాలా కష్టం. కళ్ళు పోవలసిందే గాని అవి తియ్యటం దుర్లభం" అన్నాడు.

నాలుగురోజులామె క్రమంతప్పకుండా వచ్చి చూపించుకుంది.

"ఇంక కన్ను బాగుంది. ఇంక ట్రీట్ మెంటు అవసరం లేద"న్నాడు.

''డాక్టర్ మీ ఫీసు ?"

''నేను అందరిదగ్గర ఫీసు తీసుకోను. బై" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

అతడు పెళ్ళిలో తీసినఫోటో ఒకటి తనదగ్గర భద్రపరచుకున్నాడు. ఆమె వచ్చివెళ్ళిన తరువాత ఆ ఫోటోను బైటికితీసి చూసేవాడు. పాతి కేళ్ళనాటి మాట. రెండురోజులు చూసిన నీరజను గుర్తుపట్టగలడా ?

ఈమె పేరుకూడా నీరజే. ఆ పేరు ఎంతమందికో ఉంటుంది ఆ ఒక్క అంశంచాలదు గుర్తుపట్టటం అంత సులభంకాదు. కాని-శంకర్ మాత్రం చూసి చూసి కొన్ని పోలికలను గుర్తుపట్టాడు.

ఒకరోజు హఠాత్తుగా మళ్ళీవచ్చారు వాళ్లిద్దరూ. ఆ సమయానికి చాలా మంది పేషంట్లు ఉండటంచేత వాళ్ళను లోపలికి పిలవటంలో కొంత ఆలస్యం జరిగింది.

అందరూ వెళ్లిపోయిన తరువాత ఇద్దరూ లోపలికి వచ్చారు

''ఈమెకు జ్వరం వస్తున్నదండీ సాయంత్రమయేసరికి నూరు డిగ్రీలుంటుంది అంతకంటే ఎక్కడు. ఈ విధంగా నెలరోజులయింది మాకు తెలిసిన డాక్టరు దగ్గరికివెళ్ళాము. ఆయన రోజు మూడు క్రోసీన్ మాత్రలు వేసుకొమ్మన్నాడు. ఉదయం తగ్గుతుంది. సాయంకాలానికి మళ్ళీవస్తోంది మీ సలహా తీసుకుందామని వచ్చాము." అన్నది నీరజతో వచ్చిన లెక్చరరు.

''నేను కష్టతప్ప ఇంకేమీ చూడను. అయినా మీరింతదూరం వచ్చిన తరువాత చూడకుండా పంపటం మర్యాదకాదు. ఈమెకు రక్తపరీక్ష ఊపిరితిత్తుల ఎక్సురే తీయించండి. నేనొక డాక్టరికి ఉత్తరం రాసిస్తాను. ఆ రిపోర్టు తీసుకువెళ్లి చూపించండి ఆయన ఏ రకం ట్రీట్ మెంటు తీసుకోమని సలహాఇస్తాడో చూద్దాం." ఉత్తరం రాసిచ్చాడు.

నీరజ చాలా చిక్కిపోయింది ఈ నెలరోజులలో. ఆమెకెవరయినా ఉన్నారో లేదో ? లెక్చరరును తోడుగా తీసుకువస్తోంది.

''నెలరోజులనుంచీ జ్వరమంటే ఏమయి ఉంటుంది ?"

"బహుశః నేననుకుంటున్నది కాదు-కాకూడదు.''

అయినా వారంలోపల వాళ్లిద్దరూ మళ్ళీ రావచ్చు. అతడు తన మనసును సమాధాన పెట్టుకోవాలని చూస్తున్నాడు. కాని సాధ్యపడటంలేదు.

వారంరోజులు మతిలేనివాడిలా గడిపాడు.

వాళ్లిద్దరూ రిపోర్టుతో డాక్టరు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్‌తో వచ్చారు.

అతడు సందేహించినట్టే అయింది. ఆమెకు ఊపిరితిత్తుల క్షయ.

ఆమెను హాస్పిటల్లో చేరమని డాక్టరు సలహా యిచ్చాడు.

"ఇప్పుడేం చెయ్యాలనుకుంటున్నారు ?''

"డాక్టరు హాస్పిటల్లో చేరమంటున్నాడు."

''అవును. అదే మంచిది. వాళ్ళ సమక్షంలో ఉంటే వేళకు మందులూ ఇంజక్షనులూ ఇస్తారు. కొన్నాళ్ళకు తగ్గిపోతుంది. అక్కడ ఉంటే మధ్యమధ్య ఎక్సురేలు తీస్తారు. దానిని బట్టి మందులు మారుస్తారు."

హాస్పిటల్లో ఆమెచేరి వారంరోజులయినా శంకర్‌కి ఆమెను గురించి మళ్ళీ తెలియలేదు. మొదలు 'తనకెందుకు'-ఊరుకుందామనుకున్నాడు. కాని మనసు తొందరపెట్టి ఒత్తిడిచేస్తోంది. ఆగలేక టి.బి.హాస్పిటల్‌కి ఫోనుచేశాడు.

వివరాలన్నీ తెలుసుకున్న తరువాత టి.బి. హాస్పిటల్ డాక్టర్ చెప్పాడు "ఆమె కొంతకాలం ఇక్కడ ఉండి ట్రీట్ మెంటు తీసుకోవలసిన అవసరముంది

ఊపిరితిత్తులలో సన్నటి చిల్లులు కనబడుతున్నాయి. వాటికి ఇంజక్షనులు ఇస్తు న్నాము. పుష్టికరమైన ఆహారము ఇచ్చే ఏర్పాటుచేశాము. త్వరలోనే కోలు కుంటుంది. ఆదుర్దాపడద్దు"

ఆమె ఆర్థిక పరిస్థితులను గురించి అతడికి తెలియదు. హాస్పిటల్ ఖర్చులు భరించగలదో ? లేదో ?

ఆమెనొకసారి చూడాలని అతడికి బుద్ధిపుట్టింది. కాని ఆమె తప్పుగా తలిస్తే ?

"తప్పేముంది ? తను పంపించాడు కనుక చూస్తాడు."

శంకర్‌ని చూడగానే ఆమె ఆశ్చర్యపడ్డది.

కన్నీళ్ళతో నమస్కరించింది.

"అయ్యో, మీరు బాధపడుతున్నారెందుకు ? ఎట్లాఉందో కనుక్కుందామని వచ్చాను. ఇప్పుడెట్లాఉంది ?"

"ఇంజక్షన్లతో ప్రాణం లేచివచ్చినట్టుగా ఉంది. కోడిగుడ్లు పాలు బాగా యిస్తున్నారు."

''మీ స్నేహితురాలు వస్తున్నదా ?"

"ఆమెకు పిల్లలూ-సంసారం-ఉద్యోగం. నన్ను చూడటానికి ఇంతదూరం రాలేదు.''

''మీవాళ్ళెవరు చూడటానికి రాలేదా ?"

"మావాళ్లెవరున్నారని వచ్చిచూస్తారు? నాన్నా అమ్మా కాలగర్భంలో కలిసి పోయారు. దూరం బంధువులు దూరంగా ఉన్నారు.''

''అయితే ఒంటరిగా ఉన్నారన్నమాట"

"సాయంత్రపు వేళల్లో రోగులను చూడటానికి వాళ్ళవాళ్ళు వస్తారు. ఆ రోగుల ముఖాలు ఎంతో సంతోషంగా ఉంటాయి వాళ్ళున్నంతసేపూ. నాకా అదృష్టంకూడా లేదు.''

ఆమె మెడలో పెద్దపెద్ద మంగళసూత్రాలు చీరెలో నుంచి కనబడు తున్నాయి. కాని-ఆ సంగతిని గురించి అడగటం ఎట్లా ?

అతడు వచ్చి అప్పుడప్పుడు చూస్తే బాగుండునని ఆమె మనసులో ఉంది. కాని-అతడిని అడిగితే ఏమనుకుంటాడు ? అయినా అతడెవరని అడుగుతుంది?

అతడు వచ్చేటప్పుడు రెండు పెద్ద పెద్ద ఆపిల్‌పళ్ళు తీసుకువచ్చాడు. నర్సును అడిగి చాకు తీసుకుని ముక్కలు కోసిపెట్టాడు.

ఆమె నాలుగు ముక్కలు తీసుకుని మిగతావి అతడికిచ్చేసింది.

ఆమె పడుకుని అతడిని చూస్తున్నది. ఏం మాట్లాడాలో తెలియదు. కాని అతడిని చూసినప్పుడు మనసంతా నిండుగా ఉంటుంది.

నేను వెళ్తాను. మీకు జబ్బు చాలావరకు నయమైందని డాక్టరన్నాడు. కాలేజికి లాంగ్‌లీవా?"

"అవును."

''నేను అప్పుడప్పుడు వస్తాను- మీకేం ఇబ్బంది లేదుకదా ?"

ఆ మాటకు ఆమెకు ప్రాణం లేచివచ్చింది. ఆయన వచ్చిచూస్తే తనకు ఇబ్బందా? ఆప్తులకంటె మిన్నగా ఉంటుంది అతడిని చూస్తేనే.

"నాకేం అభ్యంతరం లేదు మీరు దయతలచి వస్తే నాకు సంతోషమే."

బరువుగా నిట్టూర్చి అతడు లేచాడు. ఆమె లేచి కూర్చుంది. వీడ్కోలు ఇస్తున్నట్టుగా నమస్కారం చేసింది.

తల్లిదండ్రులు లేరు. ఆ సంపదా, ఆడంబరమంతా ఏమయిండి?

శంకర్ వెళ్ళేటప్పుడు డాక్టర్ని కలిశాడు.

''పేషంట్లకు హాలిడే ఇచ్చి ఒకటి రెండురోజులు ఇంటికి పంపిస్తాము ఇంటి వాతావరణంలో వాళ్ళు సంతోషంగా ఉంటారు. స్నేహితులను, ఆప్తులను కలుసుకున్న తరువాత తమకు జబ్బేమీ లేదనిపిస్తుంది అప్పుడప్పుడు అలా వెళ్ళి ఉత్సాహంతో తిరిగి వస్తూఉంటారు పేషంట్లు. ఆమె వెళ్ళాలనుకుంటే పంపుతాను"

"నేనామెనడిగి తెలుసుకుంటాను."

"ఆమె బిల్సు పెండింగులో ఉన్నాయా? కట్టిందా?"

డాక్టరు క్లర్కును పిలిచి అడిగాడు.

"రెండు నెలల బిల్సు ఉన్నాయి. ఆమెకు లీవు సాంక్షను కాలేదట. ఆమె తను వెళ్లేముందుకడతానని సూపర్నెంటుతో చెప్పారు."

ఆమె బిల్లు ఎంత ఉందో చూసి శంకర్ చెక్ రాసిచ్చాడు.

ఇంటికివెళ్ళి భోజనంచేసి పడుకున్నాడు. ఆరోజు పేషంట్లు రారు. తీరిగ్గా ఆలోచిస్తున్నాడు ఆమె హాస్పిటల్‌నుంచి ఇంటికి వచ్చినా కాలేజిలో ఉద్యోగం చేయగలదో లేదో? ఆమె భవిష్యత్తు? ఆమెకు ఇక్కడ ఇల్లు ఉన్నదా? ఇన్ని నెలలు అద్దె చెల్లించకుండా ఉంటే ఇంటివాళ్ల ఊరుకున్నారా?

అతడికి విషయాలు తెలిసే మార్గం కనబడలేదు. కొంతసేపటికి టెలిఫోను డైరెక్టరీ తీసి కాలేజి నెంబరు నోట్‌చేసుకున్నాడు. కాని ఆరోజు ఆదివారం.

మరునాడు ప్రిన్సిపల్‌కి ఫోను చేశాడు ఆమె కాలేజికి వస్తున్నదా అని.

"ఆమెకు టి.బి. అని డాక్టర్లు చెప్పారట. హాస్పిటల్లో ఉన్నది."

"ఆమె ఇంటి అడ్రసు చెప్పగలరా?"

"ఆమె యిల్లు ఖాళీచేసి, ఒక లెక్చరరు యింట్లో తన సామాను పెట్టుకుందట."

"ఆమెకు ఇంకెంతకాలం సెలవుంది?"

"ఇంకో రెండునెలలుంది."

"నేనామె బంధువును. అందుకని వివరాలు అడిగాను. శ్రమ యిచ్చినట్టున్నాను. క్షమించండి.

ఒకటి రెండుసార్లు శంకర్ హాస్పిటల్‌కి వెళ్ళాడు. ఆమె ఏదో ఆలోచనలో పడి చాలా పొడిపొడిగా క్లుప్తంగా మాట్లాడింది.

ఆమె హాస్పిటల్‌నుంచి డిశ్చార్జి అయితే ఎక్కడికి వెళ్ళాలా అన్న ఆలోచనలో పడ్డట్టు కనబడ్డది.

"ఒకసారి సెలవుతీసుకుని మాయింటికి రండి. హాస్పిటల్ వాతావరణం

నుంచి బైటపడితే హాయిగా ఉంటుంది" అన్నాడు.

"మీ యింటికా? ఇంకా రెండునెలల్లో వాళ్లే డిశ్చార్జి చేస్తారు. ఇంతలోకి తొందర ఎందుకు?" తలవంచుకుంది.

"పోనీ రెండు-మూడు గంటలకోసం రండి. ఇంతకూ మీ యిల్లెక్కడ? పోనీ అక్కడికి వెళ్ళండి. మీ స్నేహితురాలిని పిలిపించుకుని కులాసాగామాట్లాడి సంతోషంగా గడిపిరండి."

''ఎందుకులెండి. నాకు తొందరపడటం ఇష్టంలేదు. నేనసలే దురదృష్ట వంతురాలిని. నేను మా స్నేహితురాలికి ఉత్తరం రాశాను. ఆ యిల్లు మార్చి తనకు దగ్గరగా తీసుకోమని. ఒక్కసారే దానిలోకి మార్తాను.

ఆమెను అంతకంటె ఎక్కువ బలవంతం చెయ్యలేకపోయాడు.

ఈలోపల నీరజతో కూడా వచ్చే కాలేజి లెక్చరరు ఒకసారి పిల్లవాడికి కళ్లు చూపించటానికి వచ్చింది. విటమిన్ మాత్రలు రాసిచ్చాడు.

''మీ స్నేహితురాలు ఎట్లాఉంది? చూసివచ్చారా?" అడగలేక అడగలేక అడిగాడు.

''లేదండీ. నాకు ఇంట్లోనే సరిపోతోంది. ఆమె హాస్పిటల్ బిల్లు కూడా చెల్లించాలట. కాలేజీ అథారిటీస్ ప్రావిడెంట్ ఫండులోనుంచయినా డబ్బుయిస్తే బాగుండును. దానికామె అప్లికేషన్ రాసివ్వాలని చెప్పటానికి వెళ్లాలనుకుంటున్నా. ఏదీ-కుదరందే? ఆమెకో చిన్న ఇల్లు మా ఇంటిదగ్గరగా చూడమంటుంది. ఇల్లే కాదు. ఆమెకు రాత్రింబగళ్లు దగ్గరుండి చూసుకునే మనిషి కూడా కావాలి. ఏం చేసుకుంటుందో పాపం ఒంటరిది."

అతడేమీ మాట్లాడలేకపోయాడు.

ఆమె వెళ్ళిపోయింది.

తనను ఎవరు అపార్థంచేసుకుంటారోనని అతడు సందేహిస్తూనే పదిహేను రోజుల తర్వాత వెళ్లాడు. ముందు డాక్టరుతో మాట్లాడితే ఆమె అరోగ్యం బాగు పడిందని చెప్పాడు. "ఆమె మేము చెప్పిన ఆహారం, మందులూ తీసుకుంటూ

ఉండాలి. అప్పుడప్పుడు చెకప్‌కి రావాలి. ఎక్స్‌రే తీయించుకోవాలి. భయంలేదు లెండి. ఇప్పుడెన్నో కొత్త మందులు వచ్చాయి" అన్నాడు.

నీరజ గదిలోకి వచ్చి "నీరజగారూ'' పిలిచాడు.

ఆమె గోడవైపుకు తిరిగి పడుకుంది. పిలుపు విని ఉలికిపాటుతో ఇటు వైపుకు తిరిగి కూర్చుంది.

''ఎలా ఉంది మీకు?''

"ఆరోగ్యం బాగానే ఉంది. కాని- ఏదో నిరుత్సాహం కుంగదీస్తోంది."

''నిరుత్సాహమెందుకండీ? ఇంక త్వరలో ఇంటికొచ్చేస్తారుగా?"

"వస్తాననుకోండి. ఒంటరిబతుకు. తిన్నావా లేదా అని అడిగే దిక్కు లేదు. కాలేజినుంచి ఇంటికివస్తే పలకరించేవారులేరు. వంట చేసుకోవాలని ఉండదు ఒక్కోరోజు మంచినీళ్ళు తాగి అలాగే పడుకుంటాను. ఏమిటో..."

అట్లా సరిగా ఆరోగ్యాన్ని చూసుకోకుండా ఉంటేనే ఇటువంటి జబ్బులు వచ్చేది. మీకు బంధువులెవరూ లేరా? వండిపెట్టి మీకు తోడుగా ఉండేవాళ్లు. దూరపు బంధువులు లేరా? ఉంటే పిలుపించుకోండి.

''ఎవరూ లేరండి.''

''పుట్టింటివైపూ-అత్తింటివైపూ కూడా లేరా?"

''పుట్టింటివైపు లేరు. అత్తింటివైపు...నేనెవర్నో కూడా వాళ్ళకు తెలియదండి."

"అంటే-మీ తల్లిదండ్రులు చేసిన పెళ్ళికాదా? అసలు పెళ్ళయిందా?"

ఆమెకు పట్టరాని దుఃఖం వచ్చింది.

"క్షమించండి. నేనాప్రశ్న అడగకుండా ఉండాల్సింది. అనవసరంగా బాధ పెట్టిన వాడినయ్యాను."

"మీరడగకపోయినా ఆ బాధ ఎక్కడికీ పోదులెండి. ఆ బాధ నన్ను కాల్చుకు తింటునే ఉంటుంది. తల్లిదండ్రులు చేసిన పెళ్ళే అది. సుమారు పాతికేళ్లయింది. పెళ్ళయిన తరువాత హనీమూన్ ట్రిప్పుకు ప్రయత్నాలు జరుగుతుండగా ఢిల్లీకి ఇంటర్వ్యూకి వెళ్ళివస్తానని బయలుదేరారు. స్టేషనుకు నేనూ,మానాన్న వెళ్లాం. మాట్లాడుతూ ప్లాట్‌ఫారంమీద నిలబడ్డాం. రైలు కదిలింది. రన్నింగ్ ట్రెయిన్‌లో ఎక్కుతూ రైలుకూ, ప్లాట్‌ఫారంకూ మధ్య పడిపోయారు. రైల్వే హాస్పిటల్‌లో ఆపరేషను చేశారు. కాళ్ళు చితికిపోయాయట. ఆపరేషను అయిన తరువాత ఆయన మత్తులో ఉండగా ఇంటికివచ్చి ఆయన తల్లిదండ్రులను హాస్పి

టల్ కి తీసుకువెళ్ళారు మా నాన్న. ఆ మరునాడు 'అంతా అయిపోయిందమ్మా' అన్నారు మా నాన్న. 'ఉత్తరం రాశాను. వాళ్ళ దగ్గర్నుంచి జవాబు లేదు' అన్నారు. 'ఇంక వాళ్ళెందుకు రాస్తారు' అన్నారు నేను వెంటబడి ప్రశ్నించినప్పుడల్లా. అమ్మ అడిగితే ''భరణం అడుగుతామని వాళ్ళు రాయరు'' అన్నారట. ఇంక నేనేమి అడగలేదు. కాని నాకు-కాళ్ళు నలిగిపోతే మనుష్యులు చావరన్న నమ్మకముంది. ఆయన డాక్టరు. ఆర్థోపెడిక్సు ఎంయస్ కళ్ళవైద్యంలో డిప్లొమా ఉంది. అటువంటి ఆయన కృత్రిమ పాదాలను పెట్టించుకుని ఈ దేశంలోనో, విదేశాలలోనో ఉండే ఉంటారని నా ఆశ. నేను పిచ్చిదానిలా అ ఆశతోనే అందరినీ అడుగుతూ, విదేశాలలో ఉన్న స్నేహితులకు ఉత్తరాలురాస్తూ నాలుగేళ్ళ కిందటివరకూ ప్రయత్నించాను. నా దురదృష్టం. ఆయన జాడ తెలియలేదు. కాని—నా నమ్మకం సడలలేదు. ఏమో? ఏరోజు ఎటువంటిదో?'' ఆమెకు కన్నీళ్ళాగలేదు. సర్దుకోవటానికి ఒక గంట పట్టింది.

"చాలా దయనీయమైన మీ కథను మీచేతనే చెప్పించాను. ఆ డాక్టరు కాళ్ళు వేరే పెట్టించుకొని ఉండేఉంటాడు. ఆర్థోపిడిక్ సర్జనుగా కాకపోతే కళ్ళ వైద్యం చేస్తున్నాడేమో? మీ నమ్మకం వృధాకాదని నాకూ అనిపిస్తోంది. ఆశే మనిషిని బ్రతికిస్తుంది.'' అతడికీ కన్నీళ్ళొచినట్టున్నాయి. చేతి రుమాలుతో కళ్ళు వొత్తుకుంటూ "నేను మీరు ఇంటికి వెళ్ళేలోపల ఇంకోసారి వస్తాలెండి" అంటూ గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ వెళ్ళడం వెళ్ళడం ఆమెను డిశ్చార్జి చేసేనాటివరకూ మళ్ళా వెళ్ళలేదు.

ఆమె నీరజే.

తాను తాళికట్టిన నీరజే.

కుంటివాడు తన అల్లుడైనాడని తండ్రి అలా ప్రకటించి అందర్నీ నమ్మించాడు. అటువంటివాడు మళ్ళీ పెళ్ళెందుకు చేయలేదూ ? ఆమె చేసుకోనని పట్టుబట్టిందేమో? తనకెవరూ లేరని బాధపడుతుంది. తనకు నేనున్నానని చెప్పితే నమ్ముతుందో నమ్మదో? తను గుర్తుపట్టినట్టు ఆమె గుర్తుపట్టద్దూ ?

ఈ ఆలోచనలలో కాలం గడిచింది. ఒకసారి టెలిఫోను చేశాడు. మాట్లాడింది.

ఆమెను డిశ్చార్జి చేసేనాడు కారుందికదా- కారుతో వాళ్ళింట్లో దింపుదామని వెళ్ళాడు. నీరజ బట్టలు సూట్‌కేస్‌లో సర్దుకుని, తలదువ్వుకుని, సిల్కు చీరె కట్టుకుని మంచమ్మీద అరచేతిలో ముఖం పెట్టుకుని కూర్చుంది.

"మీరు వెళ్ళిపోయారేమో ననుకుంటున్నాను. యింకా మీ స్నేహితురాలు రాలేదా ?"

"రాలేదు. రాదులెండి. ఆమెభర్త "పిల్లలుగల యింటికి క్షయరోగిని తీసుకురావద్దన్నాడట. బిల్లు కట్టటానికి తను నేను రాసిచ్చిన అప్లికేషన్ తీసుకు వెళ్ళలేదట. డబ్బు లేదు. ఇంకో నాలుగురోజులుండు అక్కడే" అంటూ ఒక ఉత్తరం రాసి పంపించింది. నా దురదృష్టం నన్నింకా వెంటాడుతూనే ఉంది'' కన్నీళ్ళద్దుకుంది.

"ఎలాగూ నేను వచ్చానుగా ? నా కారులో తీసుకువెళ్తాను. మా యిల్లు పెద్దది. మీకు ఎటాచ్‌డ్ బాత్‌రూమ్‌తో ఒక గది ప్రత్యేకంగా ఇస్తాను. దానిలో ఉండండి. మా నౌకర్లతో పని చేయించుకోండి. మీకు ఇల్లు దొరికినతరువాత వెళ్ళిపోవచ్చు''.

"ఇక్కడ బిల్లు కట్టకుండా హాస్పిటల్‌వాళ్ళు పోనిస్తారా? పోనీ మా స్నేహితురాలు రాసినట్టుగా ఇక్కడే నాలుగురోజులుంటాను.'' పూడుకుపోయిన గొంతులోనుంచి వచ్చాయా మాటలు.

"బిల్లుదేమిటి? నేను కట్టేస్తాను. మీకు డబ్బు వచ్చినతరువాత ఇవ్వొచ్చు. కుర్చీ తెమ్మని చెప్పనా ?''

"మీరా కొత్తవారు. నాకా మరో దారి లేదు. మరొక మార్గంకూడా కనబడటంలేదు. నా విషయంలో మీరెందు కింత శ్రద్ధ తీసుకుంటున్నారు? మీ ఋణం తీర్చుకోలేకపోతానేమో? అసలే దురదృష్టవంతురాలిని.''

''అదృష్టదురదృష్టాలు నిర్ణయించేది మనంకాదు''కుర్చీతెప్పించాడు. చక్రాల కుర్చీలో ఆమె కారువరకూ వచ్చి కారులో వెనకసీటులో సూట్‌కేస్‌తో సహా ఎక్కింది. మధ్యదారిలో ఎవరూ మాట్లాడలేదు.

కారు ఇంటిముందు ఆపి హారన్ మోగించాడు. నౌకరు గేటు తెరిచి పట్టుకున్నాడు.

"దిగండి'' అన్నాడు శంకర్.

ఆమె దిగి ఇల్లంతా కళ్ళతో చూసింది. వాకిట్లో కుర్చీలో కూర్చుంది.

"లోపలికి రండి, బ్రేక్‌ఫాస్టు రెడిగా ఉంది. స్నానం చెయ్యండి. వేడినీళ్లు తయారుగా ఉన్నాయి. మీకు ప్రత్యేకించిన గదిలో మంచంపక్క సిద్ధంచేశాడు నౌకరు. రండి భోజనాల యింట్లోకి'' అతడు దారితీశాడు. అతడి వెనుక మెల్లగా వెళ్ళింది సందేహిస్తూ.

ఇడ్లీసాంబారు - ఉడకబెట్టిన కోడిగుడ్డు ఆమెముందుంచాడు నౌకరు. ఆమె తలవంచుకుని తిన్నది. నౌకరు చూపించిన గదిలోకి వెళ్ళింది. కిటికీలోనుంచి కనబడుతున్న తోటను చూసింది. వేడినీళ్ళ స్నానం చేసింది. కన్నీళ్ళుకారుస్తూ పడుకున్నట్టుంది. అట్లాగే నిద్రలోకి జారుకుంది.

పన్నెండు గంటలకు నౌకరు భోజనానికి రమ్మని పిలిచాడు. ఆమె వెళ్ళే సరికే అతడు బల్లముందర కూర్చున్నాడు.

'ఇంటిభోజనం చేసి ఎన్నాళ్ళయిందో' అనుకుంటూ భోజనం చేసింది. భోజనాలు కాగానే హాల్లో సోఫామీద కూర్చున్నా రిద్దరూ.

''మీ యింట్లో ఇంకెవరూ లేరా? మీరొక్కరేనా? పిల్లలతో ఇల్లు సందడిగా ఉంటుందనుకున్నాను.''

''మీలాంటివాడినే నేనూను ఒంటరివాడిని''

''అంటే పెళ్ళి సంసారం ..?''

"అంటే మీ చరిత్రే నా చరిత్ర. మళ్ళీ నా మాటల్లో చెప్పటం ఎందుకు ? పాతికేళ్ళ సంగతి. నా తండ్రి చనిపోయి పదేళ్ళయింది. తల్లి నిరుడే పోయింది." విషాదంగా నవ్వాడు.

''మీరు అంగీకరిస్తే మీ యిల్లేయిది. మీరు సరైనచోటికే వచ్చారు"అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

''అంటే మీ కాళ్ళు..."

''అవును నలిగిపోయాయి. వేరే పెట్టించుకున్నాను నడక బాగా ప్రాక్టీస్

చేశాను. చెబితేగాని ఎవరికీ తెలియనట్టుగా ఉంటుంది.''

"నిజంగా? నిజంగా? మీరు నిజమే చెబుతున్నారా?'' ఆ సంభ్రమంలో ఆమెకు ఏంచెయ్యాలో తోచక దిగ్గున లేచి నిలబడ్డది.

"నిజంగానే. అగ్నిసాక్షిగా మీ మెడలో తాళికట్టినంత నిజం.''

ఆమె ఆ నిజాన్ని తట్టుకోలేక నేలమీదికి జారిపోయింది.

"ఎంత ఘోరం? ఎంత ఘోరం? బ్రతికున్న మనిషిని చచ్చిపోయినట్టుగా ప్రకటించి అందరినీ నమ్మించటం'' ఆమె మనసు ఘోషిస్తున్నది. కొంత సేపటికి చల్లటి మంచినీళ్ళతో తేరుకుని "ఇదంతా నిజమా - లేక కలగంటున్నానా ?"

''కలగాదు. నిజమే. జరిగిన కథ''

ఆనందంతో ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. పాతికేళ్ళ నాటి కథ నిజమని నిరూపించటానికి అతడు పెళ్ళినాటి ఫోటో తీసుకొచ్చాడు. ఆమె కళ్ళారా చూసింది.

''మీరు మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా ఉండటం చూస్తే ఆశ్చర్యంగా ఉంది నాకు.''

"నేనూ అదేమాట అడగాలనుకుంటున్నాను.''

"అదృష్టమంటే ఇలా కలిసిరావాలి''

ఇద్దరూ ముసిముసి నవ్వులతో మధ్యాహ్నం టీ తాగారు. పాతికేళ్ళనాటి మాటలు మళ్ళీమళ్ళీ పాతికేళ్ళపాటు చెప్పుకున్నారు. ఆ కబుర్లకోసమే కాబోలు ఆమె తన ఉద్యోగం కూడా మానేసింది.